# బంపర్ ఆఫర్

"రండి... సంక్రాంతి ఉత్సవాల ధమాకా! తగ్గింపు ధరలతో పట్టు చీరల మేళా!! విచ్చేయండి..." టీవీ లో ప్రకటనతో నా ముందు పిడుగు పడినట్టు ఉలిక్కిపడి, ఠక్కున టీవీ కట్టేసి బయటికొచ్చి కూర్చున్నాను.

"ఏంటండీ! టీవీ బంద్‌చేసి వచ్చి వరండా లో కూర్చున్నారు" అంటూ వచ్చిన నా శ్రీమతి ధనలక్ష్మి టీ కప్పు నా చేతికిచ్చింది. కొంపదీసి టీవీలో ప్రకటన వినలేదుకదా అనుకొంటూ తన ముఖంలోకి పరకాయించి చూసాను. ఆ ఛాయలేమీ కనబడకపోవడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. ధనలక్ష్మి వంటగదిలో కెళ్లింది. టీ తాగుతూ గత స్మృతుల్లోకి వెళ్లాను.

రోజూ విసురుగా తన వాగ్ధాటి సుప్రభాతం తో నిద్రలేపే ధనలక్ష్మి ఆ రోజు మాత్రం కాఫీ కప్పుతో వచ్చి "లేవండీ! టైమ్ ఏడున్నర అవు తోంది' అంటూ మంచంమీద కూర్చుంది. నిద్ర చాలక ముసుగుతన్ని మళ్లీ నిద్రపోవడానికి సన్నద్ధమవుతున్న సమయంలో ఆమె నోటి నుం చి 'పట్టుచీర' అన్న పదం నా నిద్రమత్తుని వది ల్చింది. దిగ్గున లేచి కూర్చున్నాను.

కాఫీ కప్పు అందుకుంటూ "ఏం లక్ష్మీ... ఈ రోజు ఆదివారం. ఆఫీసు ఎలాగూ లేదు కదా?" అన్నాను.

నాకు మరీ దగ్గరగా కూర్చుంటూ శత్రు దళంపై మిసైల్ ప్రయోగించబోయే సైనికుడి లెవెల్లో "ఏవండీ... సంక్రాంతి ఇంకా రెండు రోజులే ఉంది. మన పక్కవీధి షోరూమ్‌లో ప్ర త్యేక ఆఫర్లున్నాయట. మనం కొన్న విలువను బట్టి ఓ ప్రత్యేక బహుమతి కూడా ఇస్తారట. ఈ రోజు పేపర్లో వేసారు" అంది.

నేననుకున్నంతా అయింది. ఆ ప్రకటన తాచుపాములా నన్ను చుట్టుకుంది. ఇంకా ఏదే దో చెప్తోంది నేను వింటున్నాననుకుని. "మనం కూడా వెళ్దామండీ" అని అడిగింది.

"నువ్వు ఆ పేపర్ ప్రకటన పట్టించుకోకు. ఇది పండుగ సీజన్ కదా? పాత స్టాక్ క్లియర్ చేసుకోవడానికి ఇలాంటి ట్రిక్స్ చేస్తుంటారు' అని కొట్టిపారేయబోయాను.

కానీ దానికి లక్ష్మి నొచ్చుకుంటూ "ఊ... మీరెప్పుడూ ఇంతేలెండి. నా మాటకు ఎప్పుడు విలువ ఇచ్చారు గనుక" అంటూ మంచమ్మీద నుంచి కోపంగా లేచి వెళ్లిపోయింది.

ఇప్పుడు తనమాట కాదంటే ఇంట్లో యు ద్ధం మొదలయ్యేటట్టుంది. లేచి రెడీ అయి "శ్రీధరా... మాధవా... మోహనా..." అంటూ బయటికి నడిచాను. వాళ్లంతా ఎవరంటారా? అప్పులిచ్చి ఆపదలో ఆదుకునే నా స్నేహితులు.

ముందు శ్రీధర్ ఇంటికెళ్లి గేటు దగ్గరే నిల్చొని "ఒరేయ్ శ్రీధర్" అంటూ పిల్చాను. ఇంతకుముందు ఓసారి చూసుకోకుండా లోప లికెళ్తే వాళ్ల కుక్క తరిమింది. సిటీబస్సుని కూడా ఓవర్‌టేక్ చేసే స్పీడ్‌తో రోడ్‌మీద పరిగెత్తిన జ్ఞాపకం ఉంది.

శ్రీధర్ వాళ్లావిడ బయటికొచ్చి "అన్నయ్యా!


నల్లా సాయిరెడ్డి


మొదటి కథ

మీరా? నేరుగా ఇంట్లోకి రా
వొచ్చుగా" అంది ఆప్యాయం
గా. ఈసారి వాళ్ల కుక్క నేను
ఊహించిన రీతిలో గుర్రుగా
లేదు. తోక ఊపుతూ నా
కాళ్లదగ్గరకొచ్చింది. వాళ్లిం
ట్లో నన్ను చాలాసార్లు చూడ
డంవల్ల కావచ్చు.

శ్రీధర్ వచ్చి, "ఏరా!
ఇంకా నిల్చునే ఉన్నావు...
కూర్చో" అనడంతో కుర్చీలో
కూర్చున్నాను. వచ్చిన పని
క్లుప్తంగా చెప్పాను. వెయ్యి
రూపాయలు అప్పు అడిగా



ను. వాళ్ల శ్రీమతి ఇచ్చిన కాఫీ తాగి శ్రీధర్ ఇచ్చిన వెయ్యిరూపాయలు తీసుకుని బయట పడ్డాను.

నా చేతిలో డబ్బు చూసి లక్ష్మి ముఖం సంతోషంతో వెలిగిపోయింది. సాయంత్రం షాపింగ్‌కెళ్దామని నిర్ణయించుకున్నాం. గంట ముందు నుంచే లక్ష్మి హడావుడి మొదలైంది. ఆ చీర కాదు ఈ చీర అని చివరికి రెడీ అయి "పదండి వెళ్దాం" అంది.

షాపు దగ్గరకొచ్చాం. రద్దీ బాగా ఉంది. ఎంట్రన్స్‌లోనే తలా ఓ కూల్‌డ్రింక్ ఇచ్చారు. లక్ష్మి బ్యాగ్‌లోంచి పేపర్ తీసి ఆ షాపు ఇచ్చే ఆఫర్ల గురించి ప్రక్కావిడ దగ్గర లెక్చర్ దంచు తోంది. రద్దీని తప్పుకుంటూ లోపలికెళ్లి చూసిన లక్ష్మి ఖంగుతింది. ప్రకటనలో ఉన్నట్టుగా కాక చీరెలు ఒకచోట కుప్పలుకుప్పలుగా పోసి ఉండ డంతో అనుమానం తీర్చుకోవాలని సేల్స్‌గరల్ నడిగింది.

"ఈ చీరెలు మాత్రమే ఉన్నాయి మేడమ్. వీటిలోంచే మీరు సెలెక్ట్ చేసుకోవాలి" అంది ఆ అమ్మాయి.

లేచిన వేళ మంచిదైంది. లక్ష్మి ఈ చీరెలు వద్దుగాక వద్దు అంటుందని అనుకుంటూండ గానే "ఏమండీ! ఈ చీర బావుంది కదూ!" అని అడిగింది. నా ఆశలు అడియాసలయ్యా యి. అరగంట సెలక్షన్ తర్వాత నాలుగు చీర లు తీసుకుంది. కౌంటర్ దగ్గరకొచ్చాం. ఆ నాలుగు చీరలతో పాటు కింద లాగించిన కూల్ డ్రింక్‌లకి కూడా కలిపి బిల్ ఇచ్చాడు మేనేజర్. బిల్‌తోపాటు ఓ చిన్న ఎర్రని అట్టపెట్టె కూడా ఇచ్చాడు.

ఆ గిఫ్ట్‌బాక్స్ చూసి లక్ష్మి ముఖం చాటంత యింది. వచ్చేదోవలో "బాక్స్‌లో డైమండ్ నక్లెస్ ఉండొచ్చుకదండీ" అంటూ ఊహాగానాలు చేయసాగింది. అత్యాశంటే ఏమిటో అప్పుడు నాకు అర్థమయింది. ఆశకైనా అంతుండాలి అన్పించింది.

ఇంటికి చేరేసరికి నాకు ఆకలి దంచే స్తోంది. "ఏదైనా టిఫిన్ చెయ్ లక్ష్మీ" అని అడిగాను. "ఐదు నిమిషాల్లో రెడీ చేస్తాను" అని హడావిడిగా వెళ్లి, స్నానంచేసి అప్పుడే కొన్న చీరెల్లో ఓ చీర కట్టుకుని వచ్చింది. ఆ చీరను చూసి ఆశ్చర్యపోవడం నావంతయింది. ఎందుకంటే ఆరుమీటర్ల చీర మూడు మీటర్లకు తగ్గింది గనుక. అంతేకాదు... ప్యాంట్ వెయ్యా ల్సిన వాడికి నిక్కరు వేసినట్లుగా ఉంది.

"ఏమండీ! బాక్స్ విప్పి చూద్దామా?" అంది ఉత్సాహపడుతూ. గిఫ్ట్‌బాక్స్ ఓపెన్ చేసి చూసే సరికి తలపై తాటికాయ పడ్డట్టయింది. దాంట్లో రెండు ఆర్టిఫిషియల్ పువ్వులు, సంక్రాంతి శుభా కాంక్షలు అన్న చీటీ ఉన్నాయి. ఆ రెండు పూలూ నా చెవిలో ఒకటీ, లక్ష్మి చెవిలో ఒకటీ అన్నట్టు మేనేజర్ నవ్విన నవ్వుకి అర్థం అప్పుడు తెలి సింది.

దీనికంతటికీ కారణం ఆ షాపు ప్రకటనే కదా! అని... పేపర్ మాన్పించేసాను. దాంతో కొంతకాలంగా టీవీ కాలక్షేపం మొదలు పెట్టా ను.

"ఏంటండీ... ఇందాకట్నుంచి పిలుస్తున్నా పలకరేం?" లక్ష్మి పిలుపుకి ఉలిక్కిపడి తేరు కున్నాను.

"ఏమండీ! పట్టుచీరల మేళా... తగ్గింపు ధరలటండీ" అంటూ మొదలుపెట్టిన లక్ష్మి మా టలను వినదల్చుకోలేదు. మళ్లీ ఆలోచనలో పడ్డాను. టీవీ కేబుల్ కనెక్షన్ ఎప్పుడు పీకేయిం చాలా? అని. ●